సాక్షి రంగారెడ్డి

బుధవారం । 16 । జూలై । 2025



సమస్యలు పరిష్కరించాలి

గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని టీపీఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. 10లో▸



ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉష సూచించారు. 10లో▸



ఆర్డినెన్స్ పేరిట మోసం

ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

దివ్యాంగులకు రాయితీపై రుణాలు

జిల్లాకు 42 యూనిట్లు మంజూరు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా 2025–26 సంవత్సరానికి జిల్లాలోని దివ్యాంగులకు ఉపాధి కల్పించడానికి పునరావాస పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు ఉపాధి పునరావాస పథకం కింద జిల్లాకు 42 యూనిట్లు మంజూరయ్యాని చెప్పారు. రూ.50 వేలకు 41 యూనిట్లు, రూ.3 లక్షలకు ఒక్కటి రాయితీతో మంజూరు చేశారన్నారు. అవసరమైన దివ్యాంగులు వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ పత్రాలు జత చేసి ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లా కమిటీ ఎంపిక చేసిన వారికి రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 88979 58726 నంబర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయత్రం 5గంటల వరకు సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధి కోసం దరఖాస్తులు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా పరిధిలో నిరుద్యోగులైన ట్రాన్స్‌జెండర్లకు ప్రైవేట్‌రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు నైపుణ్య శిక్షణ అందిస్తామని జిల్లా సంక్షేమాధికారి శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్రైవింగ్, ఫొటో, వీడియో గ్రఫీ, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, టైలరింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో నైపుణ్య శిక్షణ కోసం ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 96035 25866 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వేంకటేశ్వరస్వామి సేవలో హీరోయిన్ రష్మిక



రష్మికకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

కందుకూరు: సినీ హీరోయిన్ రష్మిక మందన మంగళవారం మండల పరిధిలోని గూడూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెను సన్మానించి స్వామి వారి జ్ఞాపిక అందజేశారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై స్పష్టత ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

కొందుర్గు: పదేళ్ల క్రితమే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ సర్వేకు రూ.10వేలు కోట్లు నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి కేటాయించారని.. నేటికీ సర్వే చేపట్టకపోవడం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మంగళవారం పార్టీ నాయకులు మాణిక్యరావు, అనిత ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండల సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.9 వేల కోట్ల ఖర్చుతో జూరాల బ్యాక్ వాటరుతో 73 కిలోమీటర్ల నిర్మాణం పనులు చేపడితే 12 మండలాలలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జంగయ్య, మండల కార్యదర్శి వెంకటేశ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్కేపల్లి భూముల కేసులో నిందితుడి పరార్

మొయినాబాద్: ఎన్కేపల్లిలోని రూ.వెయ్యి కోట్ల విలువైన భూములను నకిలీ పత్రాలతో విక్రయించిన వ్యక్తి కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 180 రెవెన్యూ సర్వే నంబర్‌లోని 99.14 ఎకరాల ప్రభుత్వ భూమిని, ఇదే గ్రామానికి చెందిన డప్పు రమేశ్ ఫేక్ డాక్యుమెంట్లతో నగరానికి చెందిన పలువురు వ్యక్తులకు విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఇందుకోసం అడ్వాన్స్‌గా రూ.1.50 కోట్లు తీసుకున్న విషయం తెలిసిందే. ఇదే విషయమై బి.లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం రమేశ్‌ను అదుపులోకి తీసుకోవాలని పోలీసులు భావించగా అప్పటికే అతను పరారైనట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలోని ప్రజాప్రతినిధులు, పెద్దలకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తేనే అన్ని విషయాలు బయటకొస్తాయని పోలీసులు చెబుతున్నారు. అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

నిషేధిత భూముల అగ్రిమెంట్లు!

లావణి, అసైన్డ్ భూములపై అధికార పార్టీ నేతల కన్ను

- మంఖాల్ కేంద్రంగా మరో భూ దందా
- నిషేధిత జాబితాలోని భూమికి గుట్టుగా అగ్రిమెంట్లు
- రియల్టర్లకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: నాలా కన్వర్షన్, నిషేధిత జాబితాలో ఉన్న లావణి పట్టా భూమిపై ఎలాంటి అగ్రిమెంట్లు చెల్లవు. కానీ ప్రభుత్వ పెద్దలతో సంబంధాలు ఉన్న ఓ రియల్టర్ ఏకంగా 33:67 రేషియోలో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంలోని పెద్దల అండదండలు, రెవెన్యూ అధికారుల సహకారంతో డెవలపర్లు రెచ్చిపోతున్నారు. రైతులను మభ్యపెట్టి విలువైన భూములను అగ్గువకే కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఫోర్త్‌సిటీకి ఆనుకుని ఉన్న మహేశ్వరం మండలం మంఖాల్ కేంద్రంగా ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇప్పటికే పలు భూములను చెరబట్టిన రియల్టర్లు తాజాగా ఇదే రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 632/1/7లో మరో 1.05 ఎకరాల లావణి పట్టాకు గుట్టుగా అగ్రిమెంటు చేసుకోవడం గమనార్హం.

క్రయవిక్రయాలు నిషేధం

మిగులు భూముల చట్టం రాకతో భూస్వాముల నుంచి పెద్ద మొత్తంలో భూములు ప్రభుత్వం చేతికి అందాయి. ఈ మిగులు భూములను అప్పటి ప్రభుత్వాలు స్థానికంగా ఉన్న పేదలు సాగు చేసుకుంటూ జీవించేందుకు పంచాయి. రెవెన్యూ యాక్ట్ ప్రకారం ఈ భూములను అమ్మడం, కొనడం నిషిద్ధం. కానీ జిల్లాలో భూముల ధరలు ఆకాశాన్నంటడం, తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ మొత్తంలో సంపాదించే అవకాశం ఉండటంతో కొంత మంది రియల్టర్లు ఈ భూములపై కన్నేశారు. పేద రైతులకు డబ్బులను ఆశచూపి, తక్కువ ధరలకే ఆయా భూములను చేజిక్కించుకుంటున్నారు. ఈ భూములు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో 99 ఏళ్ల లీజు ప్రతి పాదికన అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. ఆ తర్వాత తమకున్న పరిచయాలు, ఆర్థిక బలంతో పైరవీల ద్వారా సీలింగ్ భూములను పట్టా భూములుగా మార్చేస్తున్నారు. జిల్లాలో ఇలా ఇప్పటికే మెజార్టీ భూములు అన్యాక్రాంతమైనట్లు సమాచారం.

ఫోర్త్‌సిటీ రాకతో మరిన్ని అక్రమాలు

మీర్‌ఖాన్‌పేట్ కేంద్రంగా 30 వేల ఎకరాల్లో ప్రభుత్వం ఫోర్త్‌సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు సైతం చేపట్టింది. ఈ ఫోర్త్‌సిటీకి ఇరువైపులా విస్తరించిన ఉన్న మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, యాచారం, మంచాల మండలాల్లోని పట్టా భూములతో పాటు అసైన్డ్ భూములపై రియల్టర్ల కన్నుపడింది. ఇప్పటికే ఆయా భూములు భారీగా చేతులు మారాయి. అసైన్డ్, భూదాన్, లావణి భూముల పక్కనే ఉన్న కొద్దిపాటి పట్టా భూములను కొనుగోలు చేసి, అసైన్డ్, లావణి భూములను కలిపేస్తున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ పెద్దలతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి పట్టా భూములుగా మార్చేస్తున్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సహా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్ నిషేధిత జాబితాలో ఆయా సర్వే నంబర్లు కన్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో భూముల పొజిషన్ మాత్రం కన్పించడం లేదు.



కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో లాటరీ సమయంలో గైర్హాజరైన వారి నుంచి రిజిస్ట్రేషన్ కోసం సంతకాలు సేకరిస్తున్న సిబ్బంది

1,572 మందికి ఫార్మా ప్లాట్లు

- మొదటి విడతలో గైర్హాజరైన లబ్ధిదారులకు కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్
- రెండో విడతలో ఐదు నుంచి 18 ఎకరాలు కోల్పోయిన రైతులకు

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఇటీవల మొదటి విడత ప్లాట్ల కేటాయింపు పూర్తయింది. కాగా ఆయా తేదీల్లో హాజరు కాని లబ్ధిదారులకు ప్రస్తుతం కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ పరిధిలో 4,170 మందికి అధికారులు లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు చేపట్టగా, అందులో 2,062 మంది రిజిస్ట్రేషన్ కోసం సంతకాలు చేశారు. 1,572 మంది గైర్హాజరు కాగా ప్రస్తుతం వారికి ఆయా ఆర్డీఓల పరిధిలో రిజిస్ట్రేషన్ కోసం వివరాలు సేకరిస్తున్నారు. మొదటి విడతలో కందుకూరు పరిధిలో 1,433 మంది లబ్ధిదారులకు గాను 1,234 మందికి 60 గజాల నుంచి 544(నాలుగున్నర ఎకరాలు)గజాల ప్లాట్లు కేటాయించారు. ఐదెకరాల నుంచి 18 ఎకరాల వరకు ఉన్న దాదాపుగా 200 మంది లబ్ధిదారులకు రెండో విడతలో ప్లాట్లను కేటాయించనున్నారు. ప్రస్తుతం వారికి ప్లాట్లు కేటాయించడానికి అధికారులు పనులు చేపట్టారు. కాగా లాటరీలో ప్లాట్లు పొందిన వారి నుంచి కొంత మంది పేర్లతో శాంపిల్‌గా సబ్‌రిజిస్ట్రార్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఎలాంటి సమస్యలు లేని వారి పేర్లతో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయించనున్నట్లు అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి దాదాపు నెల రోజులు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సబితారెడ్డి

అధికారుల నిర్లక్ష్యం తగదు

- పనితీరు మార్చుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ, మామిడిపల్లి, మల్లాపూర్ పరిధిలో అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్ పనులపై అధికారులను నిలదీశారు. సమస్యలపై స్పందించకుంటే తాను ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, ఎస్ఎన్‌డీపీ నాలా పనులు తదితర అంశాల్లో నేటికీ పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు మార్చుకోవాలని.. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సరస్వతి, డీఈఈ వెంకన్న, ఏఈ హరీశ్, ఏఓ అరుణ, టీపీఓ కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వినయ్, సంపత్, రాకేశ్, కల్యాణ్, మేనేజర్ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో ఏఐ తరగతులు

- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు
- ఎన్‌ఆర్‌ఐ సహకారంతో కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు రూ.8లక్షల విలువైన కంప్యూటర్లు



కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ మౌనిక రెడ్డి


యాచారం: విద్యార్థులు విలువలతో కూడిన విద్య ను అభ్యసించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ మౌనిక రెడ్డి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను దత్తత తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె పాఠశాలకు రూ.8లక్షల విలువైన కంప్యూటర్లు, విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తరగతులను నిర్వహిస్తామని చెప్పారు. ఎన్‌ఆర్‌ఐలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల అభివృద్ధికి రూ.20 లక్షలకు పైగా వెచ్చించిన మౌనిక రెడ్డిని అభినందించారు.

ఉన్నత చదువులకయ్యే ఖర్చు భరిస్తా: మౌనిక

అనంతరం మౌనిక రెడ్డి మాట్లాడుతూ.. కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల భవిష్యత్‌కు ఎంత ఖర్చయినా వెనుకాడనన్నారు. ఇప్పటికే రూ.పది లక్షలతో పాఠశాల రూపురేఖలు మార్చామన్నారు. తాజాగా మరో రూ.10లక్షలతో డిజిటల్, ఏఐ టెక్నాలజీ ఆధారిత బోధనకు కంప్యూటర్లు అందజేశామననారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని కోరారు. పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థుల ఉన్నత విద్యభ్యాసానికి అయ్యే ఖర్చంతా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మౌనికరెడ్డి తల్లితండ్రులు రవి, కృప, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



రైతులకు అలాట్‌మెంట్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ఎన్కేపల్లి భూ నిర్వాసితులకు ప్లాట్ల పట్టాల పంపిణీ
- బీఆర్‌ఎస్ ఆందోళనలతో ఉద్రిక్త పరిస్థితులు
- రైతులు, పోలీసుల మధ్య తోపులాట

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: రైతు సంక్షేమమే లక్ష్యమని, ప్రభుత్వం ఇందుకు కట్టుబడి ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డితో కలిసి మంగళవారం ఎన్కేపల్లి భూ బాధితులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చెందిన 99.14 ఎకరాల భూములను కొన్నేళ్లుగా ఎన్కేపల్లి రైతులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం గోశాలకు కేటాయించడంతో.. 53 మంది నిర్వాసితులకు 300 గజాల చొప్పున ప్రొవిజినల్ అలాట్‌మెంట్ పట్టాలు మంజూరు చేసిందని స్పష్టంచేశారు. దీంతో పాటు గోశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ప్రభుత్వం అందజేసిన ప్లాటులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అంగీకరించిందని తెలిపారు. అనంతరం 26 మందికి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, మండల అభివృద్ధి అధికారి సంధ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు దర్శన్, అమర్‌నాథ్ రెడ్డి, హన్మంత్‌యాదవ్, కాలె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూముల వద్ద రైతుల ఆందోళన

ఎన్కేపల్లి రైతులకు పట్టాల పంపిణీ ఉద్రిక్తతలకు దారితీసింది. పరిహారం పెంచాలని కోరుతూ కొంతమంది బాధితులు మంగళవారం భూముల వద్ద రిలే దీక్షలు చేపట్టారు. బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు. అనంతరం చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు అన్యాయం చేయొద్దని, రైతులను విడదీసి పట్టాలు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై అడిగేందుకు అక్కడికే వస్తున్నామంటూ మహిళా రైతులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయానికి కదిలారు. పోలీసులు బారికేడ్లు పెట్టి వీరిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఓ మహిళా కానిస్టేబుల్ రైతు చాకలి బాలమణిని కొట్టడంతో ఆమె పెద వికి గాయమైంది. ఈక్రమంలో కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. వీరిని పోలీసులు కట్టడి చేయడంతో ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గేటు వద్దే ఆందోళన చేపట్టారు. ఎన్కేపల్లి మాజీ సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి కారు అటు వైపు రావడంతో ఆందోళనకారులు వాహనంపై దాడి చేశారు. అడ్డుకున్న పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తర్వాత సొంత పూచీకత్తుపై వదిలేశారు.



బీఆర్‌ఎస్ నాయకులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

పదవుల పండుగ

- ఎమ్మెల్యే ఎంపిక చేసిన వారే కాంగ్రెస్ మండల అధ్యక్షులు
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో భారీగా ఆశావహులు
- స్థానిక ఎన్నికల్లో 'హస్త'గతమే లక్ష్యంగా నియామకం



పార్టీ నేతలకు ఫోన్లు చేసి సమాచారం సేకరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులే సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులుగా గెలిచేలా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టి సారించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలో పార్టీ మండలాధ్యక్షుల నియామకానికి సమాలోచనలు చేస్తున్నారు. తన అనుచరులతో కలిసి ఏ వ్యక్తిని మండల అధ్యక్షుడిని చేస్తే పార్టీకి మేలు జరుగుతుందనే విషయమై చర్చలు సాగిస్తున్నారు. కొంతమంది ఫలానా వ్యక్తిని నియమిస్తే పార్టీకి మేలు చేకూరుతుందని.. సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లే సత్తా ఉందని చెబుతుండగా.. మరికొందరు ఫలానా నేతను వద్దంటూ ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో అంగ, ఆర్థిక బలమున్న నాయకులకే బాధ్యతలు అప్పగిస్తే మేలు జరుగుతుందని ఎమ్మెల్యే నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కుల సమీకరణలు

కాంగ్రెస్ సర్కార్ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న నేపథ్యంలో బీసీలకు ప్రాధాన్యం కల్పించే అవకాశం ఉంది. ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల అధ్యక్షుల ఎంపికను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అత్యధికంగా కాంగ్రెస్ బలపర్చిన నేతలే సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులుగా గెలుపొందారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న నేపథ్యంలో అన్ని మండలాల్లో కాంగ్రెస్ జెండానే ఎగురవేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇప్పటికే ఆయా మండలాల్లో సుడిగాలి పర్యటనలు చేసి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఎమ్మెల్యే ఆశీస్సులుంటేనే..

ఇప్పటికే కొందరు ఆశావహులు మండల అధ్యక్షులుగా తమ పేర్లే ప్రకటించేలా చూడాలని టీపీసీసీ పెద్దలు, మంత్రుల నుంచి ఎమ్మెల్యేకు ఫోన్లు చేయిస్తున్నారు. ఇందుకు సమాధానంగా నియోజకవర్గంలో ఎవరిని అధ్యక్షుడిని చేస్తే పార్టీకి మేలు జరుగుతుందో తనకు తెలుసంటూ సున్నితంగా సమాధానం ఇస్తున్నట్లు సమాచారం. మండల అధ్యక్షుల నియామకంలో ఆయన ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ ఎన్నికల పరిశీలకులు సైతం తాను పంపిన పేర్లే ఫైనల్ చేయాలని కోరినట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆశీస్సులున్న వారే పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులుగా ఎంపికయ్యే అవకాశం ఉంది.

ఆర్డినెన్స్ పేరిట మోసం

- రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలి
- షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా బీసీ రిజర్వేషన్లను అమలుచేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద బీఆర్ఎస్ మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ పేరుతో బీసీలను మోసం చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. గతంలో చాలా బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పటికీ అవి అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఏ బిల్లుకైనా రాజ్యాంగ పరమైన ఆమోదం లభించినప్పుడే అమల్లోకి వస్తుందని అన్నారు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ధర్నాకు తరలిన వారిలో నాయకులు ఈట గణేశ్, ఎమ్మె శ్రీలత, సత్యనారాయణ, దేవేందర్ యాదవ్, తదితరులు ఉన్నారు.



ధర్నాకు తరలిన అంజయ్య యాదవ్ తదితరులు

ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణల తొలగింపు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కొహెడలోని పిట్టల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన ఆక్రమ నిర్మాణాలను మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నంబర్ 141లోని కొంత భాగంలో చెరువు పరిధిలో ఉండగా ఎఫ్‌టీఎల్‌లోకి ప్రహరీ గోడలు వెలిశాయి. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ వంశి ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో గోడలను తొలగించారు. ఈ సందర్భంగా వంశి మాట్లాడుతూ... చెరువులు, కుంటలను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని, ఎవరైనా చెరువులను ఆక్రమించినా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రహరీని కూల్చుతున్న జేసీబీ

కంపెనీ వాహనం ఢీకొని సెక్యూరిటీ గార్డ్ మృతి



వికాస్ మృతదేహం

పహాడీషరీఫ్: తాను పనిచేస్తున్న కంపెనీ వాహనం ఢీకొని ఓ సెక్యూరిటీ గార్డ్ మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం...ఒడిశా రాష్ట్రానికి చెందిన సదానంద్ బెహరా కుమారుడు వికాస్ బెహరా(25) బతుకుదెరువు నిమిత్తం వలసవచ్చి పహాడీ షరీఫ్ రంగ నాయకుల కాలనీలో నివాసం ఉంటున్నాడు. మామిడిపల్లి శివారులోని రాక్ స్టోన్ క్రషర్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి డ్యూటీకి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున 3.45 గంటలకు కంపెనీకి చెందిన లారీ ర్యాష్‌గా రివర్స్ తీసుకుంటూ వికాస్ పైనుంచి పోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కార్మికుల భద్రత పట్టదా..?

మామిడిపల్లిలోని రాక్‌స్టోన్ క్రషర్ పరిశ్రమ నిర్వాహకులు కార్మికుల భద్రతను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.దత్తు నాయక్ ఆరోపించారు. సెక్యూరిటీ గార్డ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన గ్రామస్తులతో కలిసి ఆందోళనకు దిగారు. మామిడిపల్లి మాజీ కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ కూడా అక్కడికి చేరుకొని కంపెనీ యజమాన్యంతో చర్చించారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయానికి అంగీకరించడంతో ఆందోళన విరమించారు.

సస్యరక్షణే ముఖ్యం

- జామ పంటలో నులిపురుగుల బెడద
- ముందస్తు చర్యలతో కట్టడి చేయవచ్చు
- కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ



కందుకూరు: పండ్ల తోటల్లో మామిడి తర్వాత అధికంగా సాగు చేసేది జామ పంట. నికరాదాయంతో పాటు ఏడాదికి రెండుసార్లు దిగుబడి వస్తుండటంతో రైతులు జామ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలో దాదాపు 15,800 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం జామ సాగులో ఉంది. కాకపోతే విదేశాల నుంచి తెచ్చిన తైవాన్ రకం జామ ద్వారా దేశంలోకి నులి పురుగుల బెడద తీవ్రతరం అయింది. దీంతో తైవాన్ రకంతో పాటు దేశీయ రకాలైన అలహాబాద్ సఫేదీ, లక్నో-49 తదితర రకాలకు నులి పురుగులు ఆశించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నులి పురుగులు వేర్లను ఆశించడంతో చెట్టు ఎండిపోయి చనిపోతుంది. లక్షణాలు గుర్తించక నీళ్లు పెట్టడం, అధికంగా ఎరువులు వేయడంతో ఉపయోగం ఉండటంలేదని కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ తెలిపారు. నులి పురుగుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను గురించి ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.



నులిపురుగు ఆశించి ఎండిన జామ మొక్క

లక్షణాలు

- ఆకులు పసుపు రంగులోకి మారడం.
- కొమ్మలు, లేత చిగుర్లు వడలిపోవడం, నులి పురుగులు ఆశించిన తొలి దశలో భూమిలో తగినంత తేమ ఉన్నా మొక్కలు వాడిపోయి కన్పిస్తాయి.
- చెట్టు ఎదుగుదల లోపించడం, చెట్టు మోడు భారడం.
- పూత, పిందె రాలడం లేదా ఆలస్యం అవడం, వచ్చినా త్వరగా రాలిపోవడం.
- నీరు, ఎరువులు అందించినా మొక్క కోలుకోకపోవడం.
- ఈ లక్షణాలు అన్నీ ఎండు తెగులు లక్షణాలు పోలి ఉండటం.
- వేర్లు ముడులు ముడులుగా మారి, బుడిపెలని కలిగి ఉండటం, వేరు వ్యవస్థ క్షీణించి ఉండటం.
- నులి పురుగులు సోకిన వేరు భాగాల్లో ఎండు తెగులు శిలీంధ్రం ఆశించి వేరు కుళ్లి పోవడం.

పంట నష్టం

ఈ నులి పురుగులతో ఒక సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల వరకు జామ తోటల్లో 60–100 శాతం, నర్సరీల్లోనైతే 90–100 శాతం వరకు నష్టం వాటిల్లుతుంది.

వ్యాప్తి నివారణ చర్యలు

- నులి పురుగులు లేనివిగా నిర్ధారించబడిన నర్సరీల నుంచి మాత్రమే ఆరోగ్యవంతమైన జామ అంట్లను కొనుగోలు చేయాలి.
- జామ అంట్లు కట్టడానికి, నర్సరీల్లో అంటు మొక్కలను పెంచడానికి నులిపురుగులు లేని స్వచ్ఛమైన మట్టిని వాడుకోవాలి.
- ఆకులు పచ్చబారి, వాడిపోయి వేరుపై బొడిపెలు లాంటివి కలిగి ఉన్న మొక్కలను తోటలో నాటరాదు.

నర్సరీలో యాజమాన్య పద్ధతులు

- ఒక టన్ను మట్టిలో 50–100 కిలోల వేప చెక్క పిండి లేదా గానుగ పిండి, జీవ నియంత్రణ కారకాలైన పర్పురియోసిల్లమ్ లిలాసినస్, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, ట్రైకోడెర్మా హార్జియానమ్ ఒక్కో కిలో చొప్పున కలిపిన మట్టిని అంట్లు కట్టే ముందు సంచుల్లో నింపాలి.
- కార్బోఫ్యూరాన్ 3జీ లేదా ఫోరేట్ 10జీ 5 కిలోలను ఒక టన్ను మట్టికి కలపాలి.



బుడిపెల్లా మారిన జామ వేర్లు

- నారు మడులను, నారు మొక్కలను పెంచడానికి వాడే మట్టిని వేసవి కాలంలో తెల్లపాలిథీన్ షీటుతో (45-60 రోజులు) కప్పి ఉంచి సోలరైజేషన్ ప్రక్రియ ద్వారా నులి పురుగులను నివారించవచ్చు.
- డయాజోమెట్ గుళికలు ఎకరాకు 60 కిలోల చొప్పున వేసి కలియబెట్టి పాలిథీన్ షీటుతో కప్పి, ఒక వారం ఉంచి తర్వాత షీటును తీసి, మట్టిని తిరిగి కలియబెట్టి 2-3 రోజుల తర్వాత మొక్కలను నాటుకోవాలి. ఈ పద్ధతితో నులిపురుగులను త్వరితగతిలో నివారించవచ్చు.

తోటల్లో యాజమాన్యం

- వేసవిలో లోతుగా దక్కులు దున్ని మట్టిని కలియబెట్టాలి.
- కొత్తగా జామ తోటలు వేసే ముందు మట్టిని నులిపురుగులకై పరీక్ష చేయించుకోవాలి.
- నులిపురుగులు ఉన్న భూమిలో మొక్కలు నాటే ముందు జీవనియంత్రణ కారకాలతో సమృద్ధి చేయబడిన వానపాముల ఎరువు లేదా వేప పిండి గుంటకి 5 కిలోల చొప్పున వేసుకుని అంట్లని నాటాలి.
- ఒక టన్ను వానపాముల ఎరువు లేదా పశువుల ఎరువు లేదా వేప పిండిలో 5 కిలోల చొప్పున పర్పూరియోసిల్లమ్ సిలాసినమ్, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్, ట్రైకోడెర్మా హార్జినియమ్ కలిపి 30 రోజులు ఉంచి సమృద్ధి చేసిన మిశ్రమాన్ని 3-4 కిలోలు ఒక చెట్టుకు 6 నెలల వ్యవధిలో వేయాలి.
- పైన సూచించిన జీవ నియంత్రణ కారకాలతో ఉన్న వేప పిండి లేదా పశువుల ఎరువును 20 కిలోలను 200 లీటర్ల నీటిలో 2 రోజుల పాటు నానబెట్టి 2-3 లీటర్లతో ఒక్కో చెట్టు పాదళ్లు తడిపి నులి పురుగులను నివారించవచ్చు.

బోరు ఏర్పాటు విషయంలో ఘర్షణ

చేవెళ్ల: తాగునీటి అవసరాల కోసం బోరు వేస్తున్న విషయంలో ఇరువర్గాలకు ఘర్షణ జరిగిన సంఘటన మండలంలోని నాంచేరి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్ ప్రభుత్వ భూమిలో మంగళవారం ఉదయం మిషన్ భగీరథ అధికారులు బోరు వేయించేందుకు సిద్ధమయ్యారు. స్థానికంగా ఉండే మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ అతని కుమారులు ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు. అదే సమయంలో మాజీ సర్పంచ్ అమరేందర్‌గౌడ్ వచ్చి ఇది యూత్ భవనం కోసం కేటాయించిన స్థలంగా చెప్పి, మరో చోట బోరు వేయాలని సూచించారు. అక్కడే ఉన్న మార్కెట్ చైర్మన్ కుమారులు జైపాల్, ప్రభాకర్ గతంలో మాజీ సర్పంచ్‌తో ఉన్న మనస్పర్థల కారణంగా గొడవకు దిగారు. ఆయనపై దాడికి యత్నించారు. అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారికి సర్ది చెప్పి పంపించారు. అమరేందర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అభివృద్ధికి ఓర్వలేకనే మాజీ సర్పంచ్ రాద్ధాంతం చేశారని మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్ ఆరోపించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



శ్రీను (ఫైల్)

కేశంపేట: తరుచూ ఫిట్స్ వస్తుండటంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దేవునిగుడి తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ శ్రీను(28) ఫిట్స్ వ్యాధితో బాధపడేవాడు. ఇదే విషయమై పలుమార్లు మదన పడుతూ భార్య కమిలితో చెప్పేవాడు. ఆదివారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య గ్రామస్తుల సహాయంతో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహేశ్వరం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం కృషి చేయాలని మంఖాల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం మహేశ్వరం గేటు వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అడవుల్లో ఉండే వన్య ప్రాణులను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అటవీ క్షేత్ర అధికారి రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు పవన్, లావణ్య, ప్రకాష్, సాయివరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉమర్‌ఖాన్‌గూడలో నివాసముండే కపీంద్ర శ్యామల్ కూతురు శ్యామల్ ప్రియదర్శిని(18) మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ప్రియదర్శిని అప్పటికే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రియదర్శిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వ్యాపారం కలిసిరాలేదని యువకుడి ఆత్మహత్య

పంజగుట్ట: మానసిక వేదనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన సత్తు గురవయ్య ఎల్లారెడ్డిగూడ, శాలివాహన నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడి కొడుకు అనిల్ కుమార్(27) ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదవగా..కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. తర్వాత కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న డెకరేషన్ షాపు పనులు చూసుకుంటున్నాడు. అందులోనూ కలిసి రాలేదు. 13న డెకరేషన్ వస్తువులను డెలివరీ చేసేందుకు నిజామాబాద్ వెళ్లిన అనిల్ కుమార్ అర్ధరాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం భోజనం తర్వాత నిద్రపోతాను అని తల్లికి చెప్పి గదిలోకి వెళ్లి డోర్ పెట్టుకున్నాడు. రాత్రి అయినా బయటకు రాకపోవడంతో తలుపు విరగ్గొట్టి లోనికి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం ప్రారంభం



లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కందుకూరు: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సహకారంతో యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం-2లో భాగంగా ఎంపికైన మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాడ్జీలు అందించారు. మంగళవారం నాబార్డ్ సంస్థ 44వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ముషీరాబాద్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రామ్-2ను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించి పర్యావరణ సంస్థ అందించిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాబార్డ్ సంస్థ ప్రముఖులు ఉదయ్‌భాస్కర్, సీజీఎం రాధాకృష్ణ, సీజీఎం ఎస్‌బీఐ నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ జీఎస్ఆర్ అన్నమయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రజనీకాంత్, మెంటార్ టీచర్ పుష్పలత, ఎర్త్ లీడర్లు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి ఉష



రైతు రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఉష

మహేశ్వరం: రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి డి.ఉష సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్, ఆధార్‌కు అనుసంధానం ఉన్న ఫోన్ నంబర్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతీ రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్య(యూనిక్ కోడ్)ని కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. రైతు రుణాలు, ఇతర ఆర్థికసాయం పొందేందుకు ఈ నంబర్ తప్పనిసరి అని చెప్పారు. పంటలో కలుపు నివారణ, నానో యూరియా వాడే విధానం, వరి పంట సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుధారాణి, మండల వ్యవసాయాధికారి నాగమణి, టెక్నికల్ ఏఓ యాదగిరి గౌడ్, ఏటీఎం శ్రీవిద్య, విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం



వీఎంహోంలోని విద్యార్థులతో స్టాటిస్టిక్స్ సిబ్బంది

హుడాకాంప్లెక్స్: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో ముఖ్యమని డిప్యూటీ డైరెక్టర్ ఎస్.అజిత్‌కుమార్ అన్నారు. జాతీయ గణాంక కార్యాలయం 75వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సరూర్‌నగర్‌లోని వీఎం హోం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ మనుగడకు వృక్షాలు ఎంతో ముఖ్యమైనదని అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని అన్నారు. ఆక్సిజన్ మొక్కల పెంపకం ప్రధానమని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసరావు, నోడల్ అధికారి భరద్వాజ్, సీనియర్ స్టాటిస్టికల్ అధికారి, క్యాడియర్ స్టాటిస్టికల్ అధికారులు, సర్వే సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడుపు పెంపు

షాద్‌నగర్‌రూరల్: దూర విద్యావిధానంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం గడువును పొడగించినట్లు పట్టణంలోని జియోన్ హైస్కూల్ పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన వారికి మంచి అవకాశం అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్తంభాన్ని తొలగించిన మున్సిపల్ సిబ్బంది



ఇనుప స్తంభాన్ని కట్ చేస్తున్న సిబ్బంది

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్దలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ లైట్ల స్తంభాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. ఇటీవల సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశంతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా దామరగిద్ద వార్డు నుంచి రజినీకాంత్ నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ఇనుప స్తంభాలను తొలగించాలని ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన చేవెళ్ల మున్సిపల్ అధికారులు స్తంభాన్ని క్రేన్ సహాయంతో తొలగించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశం మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

టీపీఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని టీపీఎస్ఏ(తెలంగాణ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ చేయబడిన కార్యదర్శులకు మొదటి నియామకమైన 2019 ఏప్రిల్ 11 నుంచి వర్తింపులోకి వచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని, జిల్లాలో ఓపీఎస్ క్యాటగిరీలో విధులు నిర్వహిస్తున్న వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్షన్ చేయాలని, పెండింగ్ జీతభత్యములు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దేవేందర్, దీపిక, నయీం, గౌస్, నవీన్‌యాదవ్, శ్రీనివాస్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల వ్యవసాయ అధికారిగా శ్రీలత

మంచాల: మండల వ్యవసాయాధికారిగా ఎ.శ్రీలత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కృష్ణమోహన్ డిప్యూటేషన్‌పై షాబాద్ వెళ్లారు. ఆయన స్థానంలో కడ్తాల్ నుంచి శ్రీలత డిప్యూటేషన్‌పై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలున్న రైతులు నేరుగా కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.